వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త

- పగటిపూట పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి మాసం నుంచే ఎండలు దంచి కొడుతున్నాయి. ఏప్రిల్, మే మాసాలలో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జాగ్రత్తలు తీసుకోకుంటే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు అంటున్నారు. వడదెబ్బ గుర్తించకుంటే ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. ముందస్తు జాగ్రత్తలతో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఏప్రిల్ మాసం మొదటివారంలోనే పగటిపూట ఎండలు తీవ్రమయ్యాయి. వృద్ధులు, చిన్నారులు, పగటిపూట ఎండలో బయటకు వెళ్లకుండా చూసుకోవాలి. 35 డిగ్రీలు మొదలుకుని 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ సమయంలోనే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులను పగటిపూట ఎండలో బయటకు రాకుండా చూసుకోవాలి. వృత్తిరీత్యా బయటకు వెళ్తున్న వారు తలకు ఎండవేడి తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఎక్కువ పోషకాలు ఉన్న పండ్లు, నీరు ఎక్కువ మోతాదులో తీసుకోవాలి.



మండు టెండలో గొడుగు పట్టుకుని వెళ్తున్న చిన్నారులు

వడదెబ్బ జాగ్రత్తలు

ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది. శరీరంలో నీటిశాతం తగ్గితే వడదెబ్బ తగులుతుంది. అందువల్ల వేసవి కాలంలో శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలి. ఎండలో తిరగడంతో రక్తకణాలు కుంచించుకుపోతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటినుంచి బయటకు వచ్చే సమయంలోనే గొడుగు తీసుకువెళ్లాలి.
- తలకు క్యాప్ ధరించాలి.
- రోజుకు ఐదు నుంచి ఆరు లీటర్ల నీరు తప్పక తీసుకోవాలి.
- సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి.
- ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి.
- వదులైన కాటన్ దుస్తులు ధరించాలి.
- పుచ్చకాయ, కొబ్బరిబోండాలు.. మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి.
- కళ్లకు వేడి తగలకుండా సన్‌గ్లాస్‌లు పెట్టుకోవాలి.
- ఉడికించిన పచ్చిమామిడికాయ రసంలో ఉప్పు జీలకర్ర కలిపి తాగితే వడదెబ్బ తగలదు.

వడదెబ్బ తగిలితే

- నీరు ఉల్లిపాయరసం రెండు కణతలకు, ఛాతిమీ దపూస్తే వడదెబ్బ నుంచి ఉపశమనం లభిస్తుంది.
- వడదెబ్బ తగిలిన వారి ముఖంమీద, ఒంటి మీద నీళ్లు చల్లుతూ ఉండాలి. గ్లాసుడు నీటిలో నిమ్మ రసం, చిటికెడు ఉప్పు కలిపి తాగిస్తూ ఉండాలి.
- శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతి తీసుకోవాలి.
- వేడి వేడి పలచటి గంజీలో ఉప్పు వేసి తాగించాలి.

చిన్నారుల పట్ల జాగ్రత్తలు అవసరం



ఎండ ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో చిన్న పిల్లలను బయటకి తీసుకువెళ్లినపుడు వారి రక్షణకు తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి. ఉదయం 10గంటలలోపు, సాయంత్రం 5గంటల తర్వాత సమయాల్లో మాత్రమే బయటకు తీసుకువెళ్లాలి. అత్యవసరమై వెళ్లాల్సి వస్తే తలపై టోపీ లేక మెత్తడి దుస్తులు కప్పితీసుకువెళ్లాలి. చిన్నారులకు వేడి ప్రభావం తగిలితే వడదెబ్బ సోకే అవకాశం ఉంటుంది. వడదెబ్బ తగిలినవారిని వెంటనే స్థానిక ఆస్పత్రిలో చేర్పి సరైన సమయంలో వైద్య చికిత్స అందించాలి.

\- డాక్టర్ మౌనిక, మూసాపేట పీహెచ్‌సీ వైద్యాధికారి



శ్రీరాముని పట్టాభిషేకానికి హాజరైన ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీబాయి, కార్పొరేటర్ రోజాదేవి, ఆలయ మాజీ చైర్మన్ తులసీరావు దంపతులు

రామాలయంలో వైభవంగా పట్టాభిషేకం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరాముని పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉన్న మూలవిరాట్ శ్రీ సీతారాములకు బంగారు ఆభరణాలను అలంకరించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పట్టాభిరాముడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీబాయి, ఆలయ మాజీ చైర్మన్ తులసీరావు దంపతులు, సూర్యరావు, కార్పొరేటర్ మాధవరం రోజారంగారావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలానగర్‌లో రాములోరి పట్టాభిషేక మహోత్సవం

బాలానగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బాలానగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి, ఫతేనగర్ డివిజన్లలో రాముల వారి పట్టాభిషేకం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. బాలానగర్ రాజు కాలనీ సీతారామచంద్రస్వామి ఆలయం, ఓల్డ్ బోయిన్‌పల్లి హనుమాన్ ఆలయం, గీతానగర్‌లోని శ్రీకృష్ణ ఆలయాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.



ఉచిత వైద్యశిబిరంలో సలహాలు తీసుకుంటున్న మహిళ

ఆరోగ్య శిబిరానికి స్పందన

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని రాందేవ్‌రావు హాస్పిటల్ సీఈవో డా. యోబు అన్నారు. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తల్లీ పిల్లలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. చిన్న పిల్లలు, పిల్లల తల్లులు వందమందికి పైగా వచ్చి వైద్యశిబిరంలో పాల్గొని డాక్టర్లను కలిసి వైద్యుల సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఛాయాదేవి, భవానీ, దివ్య, తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీలో పార్టీ జెండా ఆవిష్కరించిన మాధవరం కాంతారావు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భారతదేశ అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అని ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. ఈ మేరకు బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీకోసం పనిచేసే వారికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి, ఫిలిం సెన్సార్‌బోర్డ్ మెంబర్ బసవోజు రేవతి, కేపీహెచ్‌బీ కన్వీనర్ గురుప్రసాద్, నాగలక్ష్మీ, స్వర్ణ, శిరీష, రవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్‌లో..

అల్లాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రెండోరోజు అల్లాపూర్‌లో ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ కార్యకర్తలు గోపాల్‌సింగ్, చందర్‌రావు, నార్లపురం శ్రీనివాస్, సందీప్, పూజారాం, మనోహర్, బండి జనార్దన్, వేముల జనార్ధన్, శ్రీలత, దామోదర్, నర్సింగ్, నాగరాజ్, విజయ్, సాయిచంద్, నవీన్, మల్లేష్, విజయ్ మిశ్ర, రంజిత్, సురేష్, రవి, సాయి, చరణ్, కిరణ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ



కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ దంపతులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మించబోయే కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ దంపతులు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో లింగాల బాలమ్మ, మక్కల మహేష్, బీఆర్‌ఎస్ నాయకులు కర్రె జంగయ్య, నరేందర్‌గౌడ్, మన్నె ఉదయ్ యాదవ్, గడ్డం నర్సింగ్‌రావు, లలితత, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, రత్నకుమారీ, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వివేకానందనగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎన్.వంశీరెడ్డి

హైదర్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్‌లో ఎన్‌సీఎస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ వైస్‌ఛైర్మన్ వేకానందనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎన్.వంశీరెడ్డి సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. శ్రీమాతా ఆటో యూనియన్ వారి అభ్యర్థన మేరకు వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీమాతా ఆటో యూనియన్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు రెప్పన రాజు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం



మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బాలానగర్ కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, గడిచిన 15 నెలల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం శేషాద్రినగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాలానగర్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇందిరానగర్‌లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక వసతుల కల్పనకు గతంలో బీఆర్‌ఎస్ కోట్లాదీ రూపాయలు ఖర్చు చేసిందన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలను ఆదుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిధులు లేక అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదంటూ విమర్శలు గుప్పించారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వామేనని ధీమావ్యక్తం చేశారు. ఇందిరానగర్ కాలనీవాసులు గిరి, ఎస్సీసెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణుతో పాటు ఇతర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బతుకమ్మ వేదికను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి శ్రీ దాసాంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన షెడ్డు(బతుకమ్మవేదిక)ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించడంలో సహాయసహకారాలందించిన అధికారులు, ఆలయ సిబ్బందికి, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఘటనలకు తావులేకుండా కృషిచేసిన పోలీసులకు, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, స్వచ్ఛందసేవకులను ప్రత్యేకంగా అభినందించారు. సీతారామస్వామి అనుగ్రహం అందరికి ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమయ్యగారి కొండల్‌రావు, గొట్టిముక్కల వెంగల్‌రావు, వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు, కురుమయ్యగారి నర్సింగ్‌రావు, ఆలయ మాజీ చైర్మన్ తులసీరావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, గ్రామపెద్దలు, మాజీ దేవస్థాన చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న జడ్సీ అపూర్వ్ చౌహాన్

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు వారం రోజుల్లో పరిష్కారం చూపుతామని జడ్సీ అపూర్వ్ చౌహాన్ అన్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదులను జడ్సీ స్వీకరించారు. సమస్య ఏదైనా సరే ప్రాధాన్యతా క్రమంలో వాటికి వారం రోజుల్లోనే పరిష్కారం చూపాలని సంబంధిత సర్కిల్స్ అధికారులకు జడ్సీ దిశానిర్దేశం చేశారు. కేపీహెచ్‌బీ ఏడోఫేజ్‌లో సమస్యల గురించి పలువురు స్థానికులు ప్రజావాణిలో రాతపూర్వకంగా అందజేశారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం, దోమలు, వీధి దీపాల గురించి 13 ఫిర్యాదులను అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శంకర్, ఎస్ఈ చిన్నారెడ్డి, డిప్యూటీ సిటీప్లానర్ గణపతి, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, యూబీడీఎం డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభ, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దాడిని ఖండించిన బార్ అసోసియేషన్



కూకట్‌పల్లి కోర్టు ఎదుట విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాది అలీపై జరిగిన దాడిని కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం కూకట్‌పల్లి కోర్టులో విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. అధ్యక్షుడు పెద్ద గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయానికి న్యాయవాదులు అందరూ కట్టుబడి ఉండాలని, జడ్జీలకు వినతిపత్రం ఇచ్చిన తర్వాతే నిరసనకు దిగుతున్నామనేది మర్చిపోవొద్దన్నారు. న్యాయవాదులపై దాడులను ఇప్పుడు ఖండించకుంటే భవిష్యత్తులో దీన్ని అరికట్టలేమని, అందరూ సహకరించి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులు సాయంత్రం ఐదు గంటల వరకు నిరసనలో పాల్గొని, ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలనే నినాదాలతో హోరెత్తించారు.

బెల్టుషాపు నిర్వహిస్తున్న మహిళపై కేసు నమోదు

బాలానగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బెల్టుషాపు నిర్వహిస్తూ, డ్రైడే రోజు ఇంటిలో మద్యం బాటిళ్లను నిల్వ ఉంచి ఎక్కువ ధరకు విక్రయిస్తున్న మహిళపై బాలానగర్ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఐడీపీఎల్ గూడెన్‌మెట్‌లోని ఓ కిరాణాషాపులో మద్యం విక్రయిస్తున్నట్లు స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో బాలానగర్ పోలీసులు కిరాణా షాపు వద్దకు వెళ్లి తనిఖీ నిర్వహించారు. షాపు నిర్వహిస్తున్న అమ్రమది గీత అనే మహిళ కిరాణా వస్తువులతో పాటు మద్యాన్ని కూడా విక్రయిస్తున్నట్లు తేటతెల్లమైంది. దీంతో గదిలో దాచిన 180 ఎంఎల్ గల 42 మద్యం బాటిల్లు, 10- కింగ్ ఫిషర్ ప్రీమియం బీర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీటి విలువ రూ. 12,541 ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు గీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉమెన్ ఎస్సై తోట సరళ తెలియజేశారు.

ప్రజాకాంక్ష మేరకే కాంగ్రెస్ పాలన

ఉజ్మాషకీల, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఇన్‌చార్జి



బాలానగర్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఉజ్మా షకీల

బాలానగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పథకాలు ప్రజలకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఇన్‌చార్జి ఉజ్మా షకీల పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బాలానగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటుందని ప్రజల ఆకాంక్ష మేరకే పాలన కొనసాగిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ.. పార్టీ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి అవసరం వచ్చిన తనకు ఫోన్ చేస్తే సహకరిస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, నాయకులు నాగిరెడ్డి, వేణు, పార్టీ మాజీ ఇన్‌చార్జి శేరి సతీష్‌రెడ్డి, దండుగుల యాదగిరి, కర్కపెంటయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, రాఘవేందర్, లక్ష్మయ్య, సంజీవరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

హైదర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి పాపిరెడ్డికాలనీకి చెందిన తోట్ల ప్రకాష్‌కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఆ బిల్లుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతడికి మంజూరైన రూ.42వేల చెక్కును సోమవారం పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు వరం అని, అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కెఆర్‌కె రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

అభివృద్ధి పనుల పరిశీలన

హైదర్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో రూ.2కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్, కోటి రూపాయలతో చేపట్టబోయే చిల్డ్రన్స్ పార్కు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీజేఆర్‌నగర్‌లో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, చిల్డ్రన్స్‌పార్కు నిర్మాణ పనుల్లో భాగంగా ప్రహరీ, ఫంక్షన్‌హాల్ బేస్‌మెంట్ నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. పనుల్లో వేగంగా పెంచి అన్ని వసతులతో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.కార్యక్రమంలో స్థానికులు పోశెట్టిగౌడ్, శ్యాముల్, మహేష్, ఖలీమ్, సుధాకర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లవకుశ నాటకం అదుర్స్



లవకుశ నాటకం ప్రదర్శించిన చిన్నారులను అభినందిస్తున్న సురభి రమేష్

హైదర్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఆల్విన్‌కాలనీ ఈసాస్టసాయినగర్‌లోని షిరిడీ సాయిబాబా మందిర ప్రాంగణంలో లవకుశ నాటకాన్ని ప్రదర్శించారు. విద్యార్థులు తమదైన శైలిలో నాటకాన్ని ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులకు సురభి రమేష్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎన్ కపిల్‌రాజు, సుధాకర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేష్, సతీష్ కాలనీ వాసులు, దేవస్థాన కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనాల వేలం

బాలానగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వేలం వేస్తున్నట్లు బాలానగర్ ఎక్సైజ్ సీఐ డి.వేణుకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మేడ్చల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఆధ్వర్యంలో ఈ వేలం జరుగుతుందన్నారు. ఒక కారు, 18 ద్విచక్ర వాహనాలు, 2 సైకిళ్లు వేలంలో పెట్టినట్లు ఆయన తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు అభ్యర్థులు నేరుగా బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8712658739 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని ఆయన సూచించారు.

మృతి చెందిన డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



డ్రైవర్ భార్య మాలతికి ఆర్థిక సాయం అందజేస్తున్న మల్లేష్ యాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన స్కూల్, క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ సభ్యుడు మురళి ఆకస్మిక మృతిపై కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. డ్రైవర్ కుటుంబానికి యూనియన్ సభ్యులు 16 వేల రూపాయలు ఆర్థికసాయం సమకూర్చగా వాటికి 10 వేల రూపాయలు కలిపి మొత్తం 26 వేల రూపాయలను డ్రైవర్ భార్య మాలతికి బీఆర్‌ఎస్ నాయకుడు మల్లేష్ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్, నాగరాజు, ప్రశాంత్, నవీన్, రితీష్, విజయ్ పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

హైదర్‌నగర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి పాపిరెడ్డికాలనీకి చెందిన తోట్ల ప్రకాష్‌కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఆ బిల్లుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతనికి మంజూరైన రూ.42వేల చెక్కులను సోమవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు వరం అని, అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కెఆర్‌కె రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

'ప్రజావాణి'కి ఫిర్యాదుల వెల్లువ

చందానగర్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలని చందానగర్ సర్కిల్ ఏసీపీ నాగిరెడ్డి అన్నారు. చందానగర్ సర్కిల్ -21 కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి నిర్వహించారు. హుడాకాలనీ ఫేజ్-2 జయశంకర్ సార్ పార్కును అభివృద్ధి చేయాలని పార్కు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. పార్కులో లేడీస్ టాయిలెట్లు, పార్కు కంపౌండ్ వాల్‌కు పెయింటింగ్‌లతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. చందానగర్‌లో ఓ నిర్మాణ దారుడు స్టేటస్ కో ఉండగా నిర్మాణం చేపట్టాడు. 2023లో కోర్టు డిస్మిస్ చేసినా ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని, నిర్మాణ దారునిపై చర్యలు తీసుకోవాలని స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి ఫిర్యాదు చేశారు. శిల్పా ఎన్‌క్లేవ్ పార్కును అభివృద్ధి చేయాలని శిల్పాఎన్‌క్లేవ్, డిఫెన్స్ కాలనీ,ఫ్రెండ్స్‌కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డీఈ దుర్గా ప్రసాద్, ఏఎంహెచ్‌ఓ రవికుమార్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులతో ఉప కమిషనర్ ప్రణీత

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : ప్రణీత

గచ్చిబౌలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులన్నిటినీ వెంటనే పరిష్కరించాలని ఉప కమిషనర్ ప్రణీత అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో సర్కిల్ అన్ని శాఖల అధికారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్కిల్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం ఉప కమిషనర్ మాట్లాడుతూ, ఏ శాఖల సమస్యలను ఆ శాఖ అధికారులు ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వారం రోజుల్లోగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా చెత్త కుప్పలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. సర్కిల్ కార్యాలయం ముందున్న మసీదుబండ చౌరస్తాలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్, శానిటేషన్, పట్టణ ప్రణాళిక విభాగం, రెవిన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

అభివృద్ధి పనుల పరిశీలన

హైదర్‌నగర్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ రూ.2కోట్ల అంచనా వ్యయంతో జరుగుతున్న ఫంక్షన్‌హాల్, రూ.కోటితో చేపట్టబోయే చిల్డ్రన్స్ పార్కు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీజేఆర్‌నగర్‌లో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, చిల్డ్రన్స్ పార్కు నిర్మాణ పనుల్లో భాగంగా ప్రహరీగోడ, ఫంక్షన్‌హాల్ బేస్మెంట్ నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. పనుల్లో వేగంగా పెంచి అన్నిరకాల వసతులతో ప్రజలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు పోశెట్టిగౌడ్, శ్యాముల్, మహేష్, ఖలీమ్, సుధాకర్, వర్క్ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



లవకుశ నాటకం ప్రదర్శించిన చిన్నారులను అభినందిస్తున్న సురభి రమేష్

లవకుశ నాటకం అదుర్స్

హైదర్‌నగర్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఆల్విన్ కాలనీ ఈసాస్ట్‌సాయినగర్‌లోని షిరిడీ సాయిబాబా మందిర ప్రాంగణంలో లవకుశనాటకం ప్రదర్శించారు. విద్యార్థులు తమదైన శైలిలో నాటకాన్ని ప్రదర్శించి అందరిని విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులకు సురభి రమేష్ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎన్ కపిల్‌రాజు, సుధాకర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేష్, సతీష్, కాలనీ వాసులు, దేవస్థాన కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- నగరవాసులకు మొక్కలపై పెరుగుతున్న ఆసక్తి
- ఇళ్లపై, అపార్ట్‌మెంట్ బాల్కనీల్లో విరివిగా పెంపకం
- నర్సరీల్లో అందుబాటులో వివిధ రకాలు

గచ్చిబౌలి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఉరుకులు.. పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతతను కోరుకుంటున్నారు. అందుకు అనుగుణంగా ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచేందుకు ఇష్టపడుతున్నారు. ఇండిపెండెంట్ ఇళ్లతో పాటు అపార్ట్‌మెంట్‌లో కూడా మొక్కల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌ల్లో కుండీలు మొక్కలు పెంచుతూ ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నారు. మిద్దె తోటలు పెంచుతున్న క్రమంలో మొక్కలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ కల్చర్ నగరంలో పదేళ్ల నుంచి ఈ కల్చర్ పెరుగుతూ వస్తోంది. ఇళ్లలో మొక్కల పెంపకం ఉన్నత స్థితిలో ఉన్న శ్రీమంతుల ఇళ్లలోనే కనిపించేవి. ప్రస్తుతం మొక్కల పెంపకాన్ని సామాన్యులు సైతం చేపడుతున్నారు. అందులో భాగంగానే తమకు ఉన్న కొద్దిపాటి ఖాళీ స్థలాల్లోనే పెంచుతున్నారు. మరికొంతమంది తమకు ఎలాంటి స్థలం లేకపోయినా కుండీల్లో, అపార్ట్‌మెంట్ బాల్కానీలో మొక్కలను వేలాడదీసి కుండీల్లో సైతంపెంచుతూ ప్రశాంతమైన వాతావరణం అనుభవిస్తున్నారు. నర్సరీలను పెంచుతూ మొక్కల విక్రయాలు చేస్తున్నారు. గతంలో కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డుకు మాత్రమే పరిమితమై ఉండేవి. ప్రస్తుతం నగరమంతా వ్యాపిస్తున్నాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని దాదాపు హఫీజ్‌పేట, మియాపూర్, మదీనగూడ, కొండాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి, మాదాపూర్, గోపన్‌పల్లి ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. క్రమేణా మొక్కలకు డిమాండ్ పెరిగింది. దీంతో అన్ని ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్నారు. తమకు నచ్చిన మొక్కలను ఈ నర్సరీల్లో కొనుగోలు చేసి ఇళ్ల వద్ద పెంచుతున్నారు. ప్రశాంతమైన వాతావరణానికి అలవాటుపడి ఆక్సిజన్‌ను ఇచ్చే మొక్కలను పెంచుతూ కాస్తా ఉపశమనం పొందుతున్నారు. దీంతో మొక్కల వ్యాపారులకు డిమాండ్ పెరుగుతుంది.



నర్సరీలో అందుబాటులో ఉన్న వివిధ రకాల మొక్కలు





అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎరువులు, పాత్రలు, దిమ్మెలు

రూ.30నుంచి రూ.2వేల వరకు ధర

నర్సరీల్లో రూ.30నుంచి రూ.2వేల ధర పలికే పలికే మొక్కలు దొరుకుతున్నాయి. వివిధ రకాల గులాబీలు, మామిడి, అరటి, జామ, సపోట, దానిమ్మ, ఉసిరి, నిమ్మ చెట్లు, కొబ్బరివంటి అందుబాటులో ఉన్నాయి.

- ప్రతీ ఇంటిలో మహిళలు ఎంతోభక్తితో పూజించే తులసి మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉంటున్నాయి. రూ.30నుంచి రూ.300వరకు మొక్కలను అమ్ముతున్నారు. వీటిని నాటేందుకు కావాల్సిన పాత్రలు, దిమ్మెలను కూడా విక్రయిస్తున్నారు. సిమెంటు, మట్టి, పింగాణితో చేసిన తులసి కోటలు అమ్మకాలకు ఉంచారు.
- మొక్కలకు కావాల్సిన వివిధ రకాల ఎరువులు సైతం నర్సరీలో ఉంచారు. మొక్కలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు, ఏపుగా పెరిగేందుకు వివిధ రకాల ఎరువులు ఆవుపేడతో తయారు చేసిన ఎరువులు, నిమ్మ, వేపతో పాటు వేపనూనె, వర్మికంపోస్టు, ఎర్రమట్టి విక్రయిస్తున్నారు.
- వివిధ రకాల ఆకు, కూరగాయల విత్తనాలు కూడా నర్సరీలో ఉన్నాయి.

20 ఏళ్లుగా నర్సరీలో పని చేస్తున్నా



ఇరవై సంవత్సరాలుగా నర్సరీలో పనిచేస్తున్నా. మొక్కలు అంటే నాకు ఎంతో ఇష్టం. నగర వాసులకు మొక్కలు అమ్మడం సంతోషంగా ఉంది.

- నాగేశ్వరరావు, నర్సరీ కూలీ

ఏపీ నుంచి తీసుకొస్తున్నాం



ఆంధ్రప్రదేశ్ నుంచి ఇక్కడకు మొక్కలు తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నాం. పెద్దగా లాభం లేకపోయినా మొక్కల మీద ఉన్న ఆసక్తితో వ్యాపారం చేస్తున్నాం. ఈ మధ్యకాలంలో మొక్కలు పెంచేందుకు నగరవాసులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.

- రమేష్, నర్సరీ నిర్వాహకుడు

భార్యను అతి కిరాతకంగా చంపిన భర్తకు రిమాండ్

రాయదుర్గం, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి నమ్మి పెళ్లి చేసుకుంది.. ఊరుకాని ఊరు వచ్చినా.. కడుపుతో ఉన్న భార్య అనే కనికరం లేకుండా, నడిరోడ్డుపై సిమెంట్ ఇటుకతో విచక్షణారహితంగా దాడి చేశాడో భర్త. తీవ్రగాయాలపాలైన ఆమె ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఎస్సై రాజశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. హఫీజ్‌పేట ఆదిత్యనగర్ ఉంటున్న మహ్మద్ బస్‌రత్ (32) ఇంటీరియర్ పనులు చేస్తుంటాడు. 2023 సంవత్సరం జనవరిలో ఆజ్‌మేర్ దర్గాకు వెళ్లాడు. బస్సు ప్రయాణంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన షబానా పర్వీన్(22)తో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారడంతో 2024 అక్టోబర్‌లో కోల్‌కత్తాకు వెళ్లి ఆమెను పెళ్లి చేసుకొని హఫీజ్‌పేటకు తీసుకొచ్చాడు. వేరే కాపురం పెడదామన్న పర్వీన్ ఒత్తిడితో బస్‌రత్ తల్లిదండ్రులను కాదని అదే బస్తీలో అద్దెకు ఉంటున్నాడు. అప్పటి నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు మొదలై తరచూ గొడవపడుతున్నారు. ఇటీవల పర్వీన్ గర్భం దాల్చింది. రెండు నెలల గర్భంతో ఉన్న ఆమెకు వాంతులు అధికమవడంతో మార్చి 29న భర్త ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మిట్ చేశాడు. ఆరోగ్యం కొంత మెరుగుపడటంతో ఏప్రిల్ 1న రాత్రి 10గంటల సమయంలో భార్యను డిశ్చార్జి చేయించుకొని బయట కొచ్చాడు.

ఈ క్రమంలో మళ్లీ ఇద్దరు గొడవపడ్డారు. రెచ్చిపోయిన బస్‌రత్ భార్యను ఆస్పత్రి ఎదురుగా రోడ్డుపై పడవేసి ఇష్టానుసారంగా దాడి చేశాడు. పక్కనే సిమెంటు ఇటుకలు తీసుకుని ఆమె తలపై పలుమార్లు బలంగా కొట్టాడు. ఆమె చనిపోయిందనుకుని పారిపోయాడు. పోలీసులు వచ్చి ఆమెను నిమ్స్‌కు తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లిన ఆమె పరిస్థితి విషమంగానే ఉందని పోలీసులు తెలిపారు. కాగా నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

హెచ్‌ఎంపై లైంగిక వేధింపుల కేసు

రాయదుర్గం, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధిస్తున్న దర్గా హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఎస్‌కె తాజ్ బాబుపై లైంగిక వేధింపులపై కేసు నమోదైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై భవాని తెలిపిన వివరాల ప్రకారం... గచ్చిబౌలి దర్గా జడ్పీహెచ్ స్కూల్ హెడ్‌మాస్టర్‌గా పనిఏస్తున్న ఎస్‌కె తాజ్‌బాబు ప్రైమరీవాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మహిళను లైంగిక వేధిస్తున్నట్లు తమకు ఫిర్యాదు అందిందని తెలిపారు. మహిళా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వీకర్ సెక్షన్ ప్రాథమిక పాఠశాలలో దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం

చందానగర్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు దంతాల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చందానగర్ స్మితా డెంటల్ వైద్యుడు శ్రీధర్ రెడ్డి అన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో తారానగర్ వీకర్ సెక్షన్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో పాటు పలు కాలనీల వాసులు పెద్ద సంఖ్యలో వచ్చి దంత పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, పిల్లలు ఎక్కువగా దంతక్షయం, దతాల కోత, చిగుళ్ల ఇన్‌ఫెక్షన్, బ్యాక్టీరియా ద్వారా దంత వ్యాధులు వస్తాయన్నారు.

సన్నబియ్యం పంపిణీ దేశానికే ఆదర్శం : కార్పొరేటర్ రాగం



గోపీనగర్‌లోని రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, నాయకులు

గచ్చిబౌలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం రేషన్ కార్డులున్న అందరికి సన్నబియ్యం పంపిణీచేసి పెద్దపీత వేసిందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని గోపీనగర్, నెహ్రూనగర్‌లో ప్రభుత్వం ఏప్రిల్1 వ తేదీ నుంచి ప్రారంభించిన సన్న బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించినట్లుగానే ఏప్రిల్ 1 వ తేదీనుంచి రాష్ట్రంలోని రేషన్ కార్డులున్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి ముందుగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ దశల వారీగా పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

దేశంలో ఏ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయాలనే సంకల్పంతో ముందుకుపోతున్నారని నాగేందర్ యాదవ్ వివరించారు. పేదలకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటూ వారికి ప్రభుత్వం చేదోడు వాదోడుగా ఉంటుందని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధిని కోరుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పౌరసరఫరాల అధికారులు; కాలనీవాసులు, రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



వివేకానందనగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎన్.వంశీరెడ్డి

చలివేంద్రం ప్రారంభం

హైదర్‌నగర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్‌లో ఎన్‌సీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వైస్‌చైర్మన్ వివేకానందనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎన్.వంశీరెడ్డి సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. శ్రీమాతా ఆటో యూనియన్ వారి అభ్యర్థన మేరకు వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీమాతాఆటో యూనియన్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు రెప్పన రాజు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పుష్ప వాహనంపై సీతారాముల ఊరేగింపు

భెల్ ఎంఐజీ కాలనీ రామాలయంలో ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు





పుష్ప వాహనంపై సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, తరలివచ్చిన భక్తులు

ఖెల్‌కాలనీ, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): కోలాట నృత్యాలు.. మంగళవాయిద్యాలు.. శ్రీ రామనామ స్మరణల మధ్య శ్రీ సీతారామచంద్రుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. భెల్ ఎంఐజీ కాలనీలో శ్రీరామాలయంలో 9రోజుల పాటు జరిగిన వసంత నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి దశరథరాముని ఉరేగింపును కాలనీ పురవీధుల్లో నిర్వహించారు. హనుమత్ వాహనంపై ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి, సుగంధ పుష్పాలతో అలంకరించి కాలనీలోగల ప్రధాన రహదారులపై ఊరేగింపును నిర్వహించగా స్థానిక మహిళలు, భక్త సమాజ బృందం సభ్యులు కోలాట నృత్యాలు చేస్తూ స్వామివారికి నీరాజనాలు పలికారు. కాలనీలో అన్ని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఉత్సవ విగ్రహాలను దేవాలయంలో పునఃప్రతిష్ఠించడంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. దేవాలయ ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణాచార్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవాల్లో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వేడుకల్లో వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు

బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో..

జైశ్రీరాం అంటూ శ్రీ రామనామస్మరణ నడుమ బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో శోభాయాత్ర వైభవంగా సాగింది. కృష్ణమూర్తి చారి ఫౌండేషన్, విశ్వకర్మ దేవాలయం, బీఎంఎస్ కార్మిక సంఘం, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో కాలనీలో భారీ ర్యాలీ నిర్వహించారు. మేళ తాళాలు.. డీజే శబ్దాల నడుమ కాషాయ జెండాలు చేతబట్టి వేంకటేశ్వరస్వామి దేవాలయం నుండి ర్యాలీ ప్రారంభమైంది.

టౌన్‌షిప్ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహిస్తూ రామనామస్మరణలు చేశారు. బీజేపీ నాయకులు కంజర్ల కృష్ణమూర్తి, బీఎంఎస్ అధ్యక్షుడు మహేష్, కార్యదర్శి రాజ్‌కుమార్, దేవాలయాల పాలక మండలి సభ్యులు, కార్మికులు, కాలనీవాసులు ర్యాలీలో పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళ చేనేత ప్రదర్శన

భెల్‌కాలనీ, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఇఎల్ టౌన్‌షిప్‌లోగల కమ్యూనిటీ సెంటర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచాయి. కళాసిల్క్, హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ఆధ్వర్యంలో గృహోపకరణాలకు సంబంధించిన వస్త్రాలతో పాటు డ్రస్‌మెటీరియల్స్, కుర్తాస్, కిడ్స్‌వేర్, హోంలివిన్ వంటి చేనేత వస్త్రప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ మగ్గాల నుంచి తయారైన వస్తువులతో పాటు తెలంగాణాలోని గద్వాల్, నారాయణపేట్, కొత్తపేట ప్రాంతాలకు చెందిన వస్త్రాలు ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఛత్తీస్‌గఢ్, జమ్మూకాశ్మీర్, మహారాష్ట్ర, రాజస్తాన్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులు మేళాలో ఏర్పాటు చేశారు. నెలరోజులవరకూ కొనసాగే ఈ ప్రదర్శన ఉదయం 10 నుండి రాత్రి 9గంటల వరకూ తెరిచి ఉంటుందని నిర్వాహకులు అఫ్జల్, నందు తెలిపారు. మొత్తం 50 స్టాళ్లను ఏర్పాటు చేశామని దేశవ్యాప్తంగా వివిధ హస్తకళాకారులు రూపొందించిన వస్త్రాలను చేనేత కార్మికులే నేరుగా విక్రయించుకునే విధంగా ప్రదర్శన ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.





ప్రదర్శనలో ఏర్పాటు చేసిన బొమ్మలు, పింగాణీ పాత్రలు

భానుడి భగ భగలు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సూర్య ప్రతాపం రోజు రోజుకు పెరిగిపోతోంది. భానుడి భగ భగలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వర్షాలు పడినప్పటికీ ఎండలు తీవ్రంగా ఉన్నాయని పలువురు తెలుపుతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావడంలేదు. కొందరు ఎండ వేడిమిన తట్టుకునేందుకు గొడుగులు ఉపయోగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో బస్సుల కోసం ఎదురు చూసేందుకు బస్టాండ్‌లో నీడ లేక ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్ల పక్కన గల చెట్ల కింద నిలబడి ఎండ నుంచి ఉప శమనం పొందుతున్నారు.


షాపూర్‌నగర్‌లో చెట్టు కింద నిలబడి ఎండ నుంచి ఉపశమనం పొందుతున్న ప్రయాణికులు


కొంగు కప్పుకుని వెళ్తున్న మహిళలు


గొడుగు వేసుకుని వెళ్తున్న యువతి


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమస్యలను వివరిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

దుండిగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఆయన కార్యాలయంలో సోమవారం పలు బస్తీల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు బస్తీల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.



వల్లాభాయ్‌పటేల్‌నగర్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నేతలు

చింతల్‌లో కాంగ్రెస్ నేతల పాదయాత్ర

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని వల్లాభాయ్‌పటేల్‌నగర్, వివేకానందనగర్‌లలో సోమవారం జై బాపు... జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కుత్బుల్లాపూర్ కో ఆర్డినేటర్ ఉస్మా షాకీర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేకానందనగర్‌లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సన్న బియ్యం పథకంలో భాగంగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయా కాలనీలలో పాదయాత్ర నిర్వహించి ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, ధనిక, పేద బేధాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పండరిరావు, మైనార్టీ అధ్యక్షురాలు కమల, అమీర్ సుల్తాన్, బాల్‌రెడ్డి, విజయ్, నాగమణి, సరిత, రోజా, చెన్నమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటేటప్పుడు చెయ్యి పైకి ఎత్తి దాటాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. గుండ్లపోచంపల్లి పరిధిలోని భవన నిర్మాణాల వద్ద కార్మికులకు ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై నడవాలన్నారు. వాహనాలకు ఎదురుగా ఎప్పుడూ నడవకూడదని, రోడ్డు దాటేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడకూడదని తెలిపారు.

హెచ్‌ఎంటీ భూమిలో అక్రమ నిర్మాణాలు


తాజాగా నిర్మిస్తున్న షెడ్లు


పట్టించుకోని అధికారులు

గత నెలలో నిర్మించిన షెడ్లు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి ఇరువైపులా హిందుస్థాన్ మెషీన్ టూల్స్(హెచ్‌ఎంటీ) పరిశ్రమకు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. అది కూడా సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే జరుగడం విశేషం. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం నుంచి కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు ఎడమవైపు గల ఖాళీ స్థలంలో గతంలో హరిత హారం పేరుతో 300 మొక్కలకు పైగా అధికారులు నాటించారు. సమీపంలోని ఓ మద్యం దుకాణం పక్కన స్థలంలో నాలుగు సంవత్సరాల క్రితం కొందరు 200 గజాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండగా స్థానికంగా ఉండే కొందరు రాజకీయ నాయకులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు కూల్చివేశారని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పుడు అదే స్థలంలో కొందరు రాజకీయ నాయకుల అండదండలతో అధికారులను మచ్చిగ చేసుకుని భారీ షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారని ప్రజలు తెలియచేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, కబ్జాదారులతో చేతులు కలిపి కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

విచారణ చేస్తాం

ఈ విషయంపై కుత్బుల్లాపూర్ మండల డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జునరావును వివరణ కోరగా.. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌ను పంపి వివరాలను తెలుసుకుంటాం. ఆ భూమి రెవెన్యూకు సంబంధించిందా..? హెచ్‌ఎంటీదా విచారణ చేస్తాం. హెచ్‌ఎంటీ ప్రతినిధులను సమన్వయం చేసుకుని అక్రమమని తేలితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


నో పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాలు

అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలి

షాపూర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే సూరారం ప్రధాన రహదారి, మల్లారెడ్డి ఆసుపత్రి ముందు రోడ్డుకి పక్కనే ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయడంతో ఆసుపత్రికి వచ్చేవారు, రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ వాహనాలు నిలుపరాదని గతంలో నోపార్కింగ్ బోర్డును ఏర్పాటుచేశారు. కొంత కాలానికి బోర్డును తొలగించి యధాస్థితిలో పార్కింగ్ చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నోపార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్‌ను ప్రోత్సహిస్తున్న ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని, తక్షణమే వాహనాలు తొలగించి ఆసుపత్రి ప్రాంగణంలో నిలుపుకొనేలా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కబ్జాదారుల గుండెల్లో రైళ్లు

- ఆంధ్రజ్యోతి కథనంతో చర్చనీయాంశంగా మారిన గాజులరామారం

గాజులరామారం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గాజులరామారంలో యాక్షన్ ప్లాన్.. అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి గాజులరామారం డివిజన్‌లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన కబ్జాదారులు, కబ్జాదారుల నుంచి కొనుగోలు చేసిన కొనుగోలుదారులు మా భూములు వెనక్కి తీసుకుంటారా? అని ఆందోళన చెందుతున్నారు.ఏది ఏమైనా ఈ కథనంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈమధ్య కాలంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ రెండుసార్లు గాజులరామారం ప్రాంతంలోని పలు ప్రభుత్వ సర్వే నంబర్లలో పర్యటించి, కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులను భూముల కబ్జాలపై ననివేదిక ఇవ్వాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అధికారులు కూడా ఆ దిశగానే చర్యలు తీసుకోవడంలో నిమగ్నమయ్యారు. అయితే ప్రభుత్వ భూములను కబ్జా చేసిన కబ్జాదారులు ఎక్కడ నుంచి ఎక్కడ వరకు భూములను అధికారులు స్వాధీనం చేసుకుంటారని ఆరా తీయడంలో నిమగ్నమైనట్లు విశ్వసనీయ సమాచారం.

గుంతను పూడ్చడంలో అధికారుల అలసత్వం


రోడ్డుపై తవ్విన గుంత

గాజులరామారం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మంచినీటి పైప్‌లైన్ల మరమ్మతుల కోసం గుంతను తవ్వి రెండు నెలలు గడుస్తున్నా పూడ్చడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. గాజులరామారం డివిజన్‌లోని బాలయ్యబస్తీలో మంచినీటి పైప్‌లైన్ లీక్ అవ్వ డంతో వాటర్ వర్క్స్ సిబ్బంది పైప్‌లైన్ మరామ్మత్తుల కోసం తవ్వి, మరామ్మతులు చేశారు. గుంతలను పూడ్చకుండా అలానే ఉండడంతో రాత్రి వేళ సమయంలో వాహన దారులు రోడ్డుపై వెళుతూ ఆగుంతను గమనించకుండా అందులో పడుతున్నారని స్థానికులు తెలుపు తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


కబేళాకు తరలిస్తున్న ఆవులు

గోవులను పరిరక్షించండి: శివపార్వతి

షాపూర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కొందరు గోవులను కబేళాకు తరలించి పశుసంపదను నాశనం చేస్తున్నారని జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు శివపార్వతి మండిపడ్డారు. ప్రకృతి సమతుల్యతను పరిరక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతోనే అక్రమ వ్యాపారుల ఆగడాలకు అవధులు లేకుండా పోతున్నాయి. ఊర్లలో గోవులను తక్కువ ధరకు కొనుగోలు చేసి కబేళాకు తరలించి జోరుగా సొమ్ము చేసుకొంటున్నారు. వీరిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పవిత్రంగా పరిగణించే గోమాతను ఇలా కబేళాలకు తరలించి వ్యాపారం చేసేవారిపై అధికారులు చర్యలు చేపట్టాలని, ధరిత్రి సమతుల్యతను పరిరక్షించాలని ఆమె కోరారు.

ఆకతాయిల ఆగడాలు అరికట్టాలి

- జగద్గిరిగుట్టలో ఆకతాయిల వీరంగం
- మద్యం మత్తులో మహిళ పట్ల అసభ్యకర ప్రవర్తన
- మామూళ్ల మత్తులో అధికారులు

జీడిమెట్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్టలో మద్యంప్రియులు అర్ధరాత్రివేళ వీరంగం సృష్టిస్తున్నారు. నివాసాల మధ్య మద్యం, గంజాయి తాగుతూ హంగామా చేస్తున్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, అడ్డుచెప్పిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, దీంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని మహిళలు వాపోతున్నారు. రెండురోజుల క్రితం అర్ధరాత్రి జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ బాపూజీ స్కూల్ ఆవరణలో దాదాపు 20మంది యువకులు మద్యం, గంజాయి తాగి నానా హంగామా సృష్టించారు. అడ్డుకున్న స్థానికులపై దాడులకు దిగారు.

ప్రతినిత్యం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు బస్తీలు/కాలనీల్లో ఇదేవిధంగా జరుగుతోంది. పోలీసుల అసమర్థత కారణంగా ఆకతాయిలు రెచ్చిపోతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రిక్షాపుల్లర్‌కాలనీ, వెంకటేశ్వరనగర్, దీనబంధుకాలనీ, అంజయ్యనగర్, లెనిన్‌నగర్, శ్రీనివాస్‌నగర్, బీరప్పనగర్ ప్రాంతాల్లో ఆకతాయిలు శృతిమించిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జగద్గిరిగుట్ట ప్రాంతంలో అర్ధరాత్రి కూడా మద్యం షాపులు వెనుక నుంచి అమ్మకాలు సాగిస్తున్నారు. అంతేకాకుండా ప్రతిబస్తీలో అక్రమంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. షాపుల యజమానులు అందించే నజరానాలతో కుత్బుల్లాపూర్ ఎక్సైజ్, జగద్గిరిగుట్ట పోలీసులు వీరికి పూర్తి అండదండలు అందిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సిటింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసుకున్నా పట్టించుకోరు. బీరప్పనగర్ ప్రాంతంలోని ఓ వైన్‌షాప్ నిర్వాహకుల పుణ్యమాంటూ స్థానికులు ఇళ్లల్లో ఉండలేక పోతున్నారు. చీకటిపడితే గల్లీ మొత్తం మద్యంప్రియులతో నిండిపోతుంది. అదేవిధంగా జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డుపైన కూడా ఇదే పరిస్థితి. దీనబంధుకాలనీ చౌరస్తాలో ఓ మహిళ చిన్నడబ్బా ఏర్పాటు చేసుకుని నిత్యం మద్యం అమ్మకాలు సాగిస్తోంది. కూనమహాలక్ష్మీనగర్‌లోని బతుకమ్మకుంట ఎదురుగా ఓ వ్యక్తి దర్జాగా ఇంట్లోనే సిటింగ్‌రూమ్ ఏర్పాటు చేసి బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా డీసీపీ స్థాయి అధికారులు మందు, గంజాయి బాబుల ఆగడాలను అరికట్టాలని మహిళలు కోరుతున్నారు.


మహిళలపై రెచ్చిపోతున్న మద్యంప్రియులు


ప్రజల ఫిర్యాదులపై అధికారులతో చర్చిస్తున్న డీసీ నర్సింహ

ప్రజావాణికి ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ సోమవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ విభాగానికి 2, విద్యుత్ విభాగానికి ఒక దరఖాస్తు వచ్చిందని ఉప కమిషనర్ నర్సింహ తెలిపారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో విద్యుత్ విభాగానికి 2, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు ఒక్కో దరఖాస్తు వచ్చిందని ఉప కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నేరుగా పరిశీలించి సాధ్యమైనంత త్వరలోనే పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములపై ఫిర్యాదు


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 4వందల ఎకరాల భూమిని ఐఎంజీ భారత్‌కు కేటాయించడం తగదని హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి ఆకుల సతీష్ రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1975 సంవత్సరంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చొరవతో శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలిలో సర్వే నంబరు 25లో 4 వందల ఎకరాల్లో హెచ్‌సీయూ వర్సిటీని ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఐఎంజీకి కేటాయించడం తగదన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకొని ఆ భూములను హెచ్‌సీయూకి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.


పూడిక తీసిన మట్టిని రోడ్డుపైనే వేయడంతో ప్రజల ఇబ్బందులు

రోడ్డుపైనే పూడిక మట్టి.. రాకపోకలకు ఇబ్బంది

షాపూర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులో పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న కల్వర్ట్‌లో పూడికను తీసి రోడ్డుపైనే వేయడంతో రాకపోకలకు అంతరాయం వాటిల్లుతోంది. దీనివల్ల విపరీతమైన దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు తెలియచేశారు. షాపూర్‌నగర్ నుంచి వెళ్లే పెద్ద నాలాపై ప్రధాన రహదారికి పక్కనే ఉన్న కల్వర్ట్‌లో కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన పూడికను సోమవారం తీసి రోడ్డుపైనే వేశారు. ఈ మట్టిని జీహెచ్‌ఎంసీ వారు ఎప్పుడు తొలగిస్తారో తెలియదు. కల్వర్టులో మట్టిని తీసిన వెంటనే తరలిస్తే ప్రజలకు ఇబ్బందులు ఉండదని పలువురు అంటున్నారు. తక్షణమే పూడిక మట్టిని తొలగించాలని కోరుతున్నారు.

మంటలంటుకుని బైక్ దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న స్థానికులు, పోలీసులు

జీడిమెట్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మంటలంటుకుని బైక్ కాలిపోయిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమయ్యనగర్‌కు చెందిన బోగి సంతోష్‌కుమార్(20) బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం 11.30 సమయంలో బైక్‌పై జగద్గిరిగుట్టలోని హరిహామ్ మోటార్స్‌కు వెళ్లి రోడ్డుపై పార్కుచేసి లోపలికి వెళ్లి తనకు కావాల్సిన సామగ్రి కొనుగోలు చేశాడు. తిరిగివచ్చి బైక్‌ను స్టార్ట్ చేయగా స్పార్క్ వచ్చి బైక్ అంటుకుని పూర్తిగా కాలిపోయింది. పోలీసులు, స్థానికులు నీటిని పోసి మంటలను అదుపు చేశారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. జగద్గిరిగుట్ట పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు గురైన బాలుడు


చికిత్స పొందుతున్న బాలుడు

జీడిమెట్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన ఐదేళ్ల బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలోని సుభాష్‌నగర్‌కు చెందిన శివకుమార్(5) అనే బాలుడు నాలా పక్కన ఉన్న ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. నాలాలో నుంచి వచ్చిన పాము బాలుడిని కాటు వేయడంతో బాలుడు కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు బాలుడిని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.